క్లుప్తంగా

చిన్నారులకు వాలీబాల్ శిక్షణ



తూర్పుపాలెంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మలికిపురం: తూర్పుపాలెంలో ఉభయ గోదావరి జిల్లా స్థాయిలో ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి సుమారు 80 మంది చిన్నారులు హాజరై శిక్షణ పొందుతున్నారు. స్థానిక అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు హాజరైన వారికి ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

హనుమద్ జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు



అంబాజీపేటలో పందిరి రాటకు పూజ చేస్తున్న భక్తులు

అంబాజీపేట: స్థానిక పశువుల మార్కెట్ వద్ద భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో హనుమద్ జయంతిని ఈ నెల 22న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయం వద్ద శుక్రవారం పందిరి రాట ముహూర్తం పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

బాలిక వైద్యానికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన దస్తావేజు లేఖరి అత్తిలి శ్రీనివాస్ కుమార్తె సాయి గాయత్రి కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమెను రక్షించుకునేందుకు తండ్రి శ్రీనివాస్ తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె వైద్య ఖర్చుల కోసం పలువురు ఆర్థిక సాయం అందించారు. సఖినేటిపల్లిలో సాయి గాయత్రి వైద్యం కోసం ఆమె పెదనాన్న అత్తిలి శివప్రసాద్‌కు రూ.10 వేలను గెద్దం వరప్రసాద్, దొండపాటి పుష్పప్రసాద్, తాడి సహదేవ్ చేతుల మీదుగా అందించారు. ఈ నగదును ఇజ్రాయెల్‌లో ఉంటున్న సఖినేటిపల్లికి చెందిన గాడ్ లవ్స్ ఫ్యామిలీ గ్రూపు, దొండపాటి బాలరాజు సమకూర్చారని సహదేవ్ తెలిపారు.

సరస్వతీ నది పుష్కరాలకు రెండు ప్రత్యేక బస్సులు



సరస్వతీ నది పుష్కరాలకు వెలుతున్న భక్తులు, బస్సులు

రావులపాలెం: సరస్వతీ నది పుష్కరాలకు రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు వెళుతున్నట్టు శుక్రవారం డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో యాత్రికులు పుష్కర స్నానం ఆచరించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

ధాన్యంలో మొలకలు.. రైతన్నల దిగులు

- కళ్లాల్లోనే మొలకలొచ్చినా పట్టించుకోని ప్రభుత్వం
- ధాన్యం విక్రయానికి టార్గెట్ పేరుతో అడ్డంకులు
- రైతుల సంక్షేమంపై కూటమి నేతల నిర్లక్ష్య ధోరణి



ఇరుసుమండలో తడిసిన ధాన్యాన్ని సంచుల్లోకి నింపుకొంటున్న రైతులు



ఇరుసుమండలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు శ్రీనివాసరావు

అంబాజీపేట: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు ప్రస్తుతం అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం టార్గెట్ పేరుతో రైతులను నిండాముంచేస్తోంది. అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు రైతులను మోసం చేశారని పలువురు విమర్శిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రైతులకు మేలు చేకూరిందని, కూటమి ప్రభుత్వంలో అప్పులు పాలవ్వడం తప్ప ఒరిగిందేమీ లేదని రైతన్నలు వాపోయారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కళ్లాల్లోనే ధాన్యం మొలకెత్తిందని రైతులు కంటతడి పెడుతున్నారు. జగన్ ప్రభుత్వంలో పండించిన పంటను విక్రయించుకునే వెసులుబాటు ఉండటమే కాకుండా రైతుల బ్యాంకు ఖాతాలో వాటికి సంబంధించిన నగదు జమ చేసేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పండించిన పంటను కళ్లాల్లో కాపలా కాస్తూ ఎప్పుడు కొంటారని ఎదురుచూడాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

టార్గెట్ల పేరుతో ధాన్యం కొనుగోలుకు జాప్యం

ప్రస్తుత ప్రభుత్వం టార్గెట్ల పేరుతో ధాన్యం కొనుగోలుకు జాప్యం చేస్తూ రైతుల నెత్తిన మట్టి కొడుతున్నారని పసుపల్లి గ్రామానికి చెందిన వరి రైతు వక్కపట్ల శ్రీనివాసరావు, ఇరుసుమండ గ్రామానికి చెందిన యనమదల మోహనకృష్ణతో పాటు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఈనెల 15న అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి అంబాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో కళ్లాల్లో ఉంచిన ధాన్యం రాశులు, బస్తాలు తడిసి ముద్దయ్యాయి. పది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నానని, పంట చేతికి వచ్చి 20 రోజులు గడిచినా ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రాలేదని, ధాన్యాన్ని తూకం వేయాలని అధికారులను కోరగా ప్రభుత్వం ఇచ్చిన మొదటి టార్గెట్ పూర్తయింది, రెండవ టార్గెట్ వచ్చిన తర్వాత కొనుగోలు చేస్తామని చెబుతున్నారని శ్రీనివాసరావు అన్నారు. రైతు పండించిన పంటల కొనుగోలుకు ప్రభుత్వం టార్గెట్లు పెట్టడం ఏమిటని, తడిసిన ధాన్యానికి సమాధానం ఎవరు చెబుతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతు యనమదల మోహనకృష్ణ మాట్లాడుతూ ఏడు కుంచాల సొంతం పొలంతో పాటు మరో ఎకరం కౌలుకు చేస్తున్నానని, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో వరి సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అకాలంగా కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులు తడిసి ఎకరానికి ఐదారు బస్తాల ధాన్యం దెబ్బతిందని తెలిపారు. దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేయలేమని అధికారులు చెబుతున్నారని రైతులు తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో రైతులకు తీవ్ర నష్టం

కూటమి ప్రభుత్వ విధానాలకు రైతులు ఎందుకు నష్టపోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్నదాతలకు రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాల ద్వారా ఆర్థిక సాయం అందేదని, కూటమి ప్రభుత్వం వచ్చి 11 నెలల కావస్తున్నా రైతులకు ఇప్పటి వరకు ఎటువంటి ప్రయోజనం లేదని పలువురు ఆరోపించారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం కారణంగా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం నెలకొందని, అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరారు. మండలంలోని గ్రామాల్లో కళ్లాల్లో ఉంచిన ధాన్యం రాశులను కాపలా కాస్తూ, ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారుల రాక కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

బాల గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు: పెదపళ్లలో వేంచేసియున్న బాల గణపతి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెదపూడి సత్యనారాయణాచార్యులు (సత్తిబాబు) ఆధ్వర్యంలో ఆలయంలోని మూలవిరాట్, ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు, కుంకుమ, చందన, హరిద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర పూజ, గరిక అర్చనలు చేశారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల గణపతిని పుష్పాలతో అలంకరించారు.

వడగాల్పులపై నేడు అవగాహన సదస్సులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వేసవి ఎండలు, వడగాల్పుల నుంచి రక్షణ పొందేందుకు శనివారం ఆయా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి. వెంకటసరోవరరావు శుక్రవారం తెలిపారు. ప్రతి గ్రామస్థాయి, సచివాలయ పరిధిలోని అధికారి ఈ సదస్సుకు హాజరై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు సంబంధించిన వివరాలను గ్రామస్తులకు వివరించాలన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, వడగాల్పుల బారిన పడ్డ వారు ఇంటి వద్ద తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులను దగ్గరలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లడం, వారికి తగు చికిత్స అందించడం వంటి మెలుకువలను నేర్పించాలన్నారు. ఈ అవగాహన సదస్సులు గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అష్టలక్ష్మికి కుంకుమార్చన

మలికిపురం: స్థానిక వంతెన వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంకాలం నుంచి అష్టలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో లలిత సహస్ర పారాయణ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నిర్మూలన సాధ్యం





అంబాజీపేటలో దోమల వృద్ధిని ప్రజలకు వివరిస్తున్న మలేరియా అధికారి వెంకటేశ్వరరావు , నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

ఆలమూరు: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నిర్మూలన సాధ్యమవుతుందని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్, బి.అనంత రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని పీహెచ్‌సీ కార్యాలయాల ఆవరణతో పాటు ఆయా గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎస్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైడే పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొనేలా ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎస్.లక్ష్మీస్నేహ సూచించారు. శుక్రవారం ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల వల్ల కలిగే ప్రాణాంతక వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడే, ఫ్రైడే ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

మామిడికుదురు: దోమల నిర్మూలతోనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలత సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ పేర్కొన్నారు. సీహెచ్‌ఓ సత్యవతి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట: దోమల నివారణతోనే వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలేరియా ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అంబాజీపేట హడ్కో కాలనీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన ర్యాలీని వైద్యాధికారి కె.ఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు కారణంగా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, పీహెచ్ఎన్ భూలక్ష్మి, ఎంపీహెచ్ఎస్ ఎన్.మధుబాబు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవిల్లి: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అయినవిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు పి.సంతోష్‌కుమార్ సూపర్ వైజర్ పి.ప్రసాదరావు, పీహెచ్ సిబ్బంది మెహర్‌వాణి తదితరులు ఉన్నారు.

రోడ్డును అభివృద్ధి చేయాలని ఆందోళన



రోడ్డు నిర్మాణం కోసం పాశర్లపూడిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ పాశర్లపూడిలంకలో స్థానికులు శుక్రవారం ధర్నా చేశారు. నూతనంగా డ్రిల్లింగ్ చేపట్టిన సైటు గేటు వద్ద రోడ్డును అభివృద్ధి చేయాలని నినాదాలు చేశారు. 60 మీటర్ల మేర ఉన్న మార్గాన్ని సిమెంట్, కాంక్రీటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై సైటు ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలా సత్యనారాయణ, త్సవటపల్లి పుత్ర సత్యనారాయణ, పెదమల్లు సత్యనారాయణ, కాంగ్రేగుల రాంబాబు, బాబీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల విరాళం



ప్రిన్సిపాల్‌కు చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ. 51 వేలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబాకు 2004-07 డిగ్రీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సేకరించిన రూ. 51 వేలు అందజేసి దానిపై వచ్చే వడ్డీని ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందించాలని పూర్వ విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యాపకుడు రుద్రా శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు రుద్రా స్వామి నాయుడు, ఏడిద మునేశ్వరరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై కళాజాత బృందం అవగాహన ప్రదర్శన



అరటి మార్కెట్ యార్డులో ఎయిడ్స్‌పై ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

రావులపాలెం: ఎయిడ్స్, హెచ్‌ఐవీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా కలిసిమెలిసి జీవించాలంటూ కళాజాత బృందం సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అరటి మార్కెట్ యార్డులో శుక్రవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ ప్రదర్శనలు గ్రామాల్లో కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీమ్, జన కళ్యాణ వెల్ఫేర్ సొసైటీ, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొని ద్రాక్షారామకు చెందిన రాంబాబు బుర్రకథ కల్చరల్ ఈవెంట్స్ శ్రీనివాస్‌రావు తదితరులు ఈ ప్రదర్శన నిర్వహించారు.

భారత సైన్యానికి మద్దతుగా తిరంగా ర్యాలీ



పి.గన్నవరంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి తదితరులు

పి.గన్నవరం: పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత సైనికులకు సంఘీభావంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ జాతీయ పతాకంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్యనారాణమూర్తి, తోలేటి సత్తిబాబు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

మామిడికుదురు: కొత్త రేషన్ కార్డుల ప్రక్రియకు సంబంధించి నిబంధనలను సడలించాలని రాజోలు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు యాలి శ్రీనివాస్ శుక్రవారం కోరారు. వివాహితులైన కుమారులు, కుమార్తెల పేర్లు ముందుగా తొలగించిన తర్వాతనే వారి అర్హత ఆధారంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని సూచించారు. కొత్త నిబంధనల వలన ఎన్నో సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు. కేవలం మృతుల పేర్లు మాత్రమే రేషన్ కార్డుల నుంచి తొలగించే అవకాశం ఇచ్చారని చెప్పారు. వీరితో పాటు ఇతరుల పేర్లను కూడా తొలగించుకునే వెసలుబాటు కల్పించాలని శ్రీనివాస్ కోరారు. పరిస్థితులకు అనుగుణంగా సింగిల్ సభ్యునికి కూడా రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు.

మురుగు పోయేందుకు దారేదీ?

- గ్రామాల్లో పూడుకుపోయిన డ్రెయిన్లు
- తొలగని ముంపు భయం
- పలు చోట్ల ఆక్రమణలు
- మరమ్మతులకు నోచుకోని గ్రామాల్లోని డ్రెయిన్లు



మోరిపోడులో అభివృద్ధికి నోచుకోని డ్రెయిన్ దుస్థితి



విశ్వేశ్వరాయపురంలో రోడ్డు పైకి పొంగి ప్రవహిస్తున్న మురుగునీటి డ్రెయిన్

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లోని కాలనీలు, గ్రామ కంఠాల్లోని అనేక డ్రెయిన్లు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలం వచ్చిందంటే ప్రజల అవస్థలు వర్ణనాతీతం. గృహాల నుంచి సాధారణ వాడకం నీరు దిగేందుకే ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతుండగా ఇక వర్షాకాలంలో ముంపు, మురుగు నీరు ప్రవహించక వీధులన్నీ జలమయమవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం గ్రామాల్లో ఏళ్ల తరబడి డ్రెయిన్లు పూడుకుపోవడమేనని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయిన్ల అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రతి గ్రామంలోనూ వివిధ కాలనీలతో పాటు గ్రామ కంఠాలను చేర్చి చిన్న పాటి రెవెన్యూ డ్రెయిన్లు ఉంటాయి. వీటి ద్వారా మురుగునీరు దిగి మీడియం డ్రెయిన్లకు చేరుతుంది. ఒక్కొక్క గ్రామానికీ సుమారు 5 నుంచి 10 కిలోమీటర్ల పొడవున ఈ చిన్న పాటి డ్రెయిన్లు ఉన్నాయి. మురుగునీటిని తరలించడంలో ఇవి చాలా కీలక పాత్ర పోషిస్తాయి. ఇంతటి ప్రాధాన్యత గల డ్రెయిన్ల అభివృద్ధిపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఈ డ్రెయిన్లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రధానంగా పంచాయతీలపై ఉంటుంది. పంచాయతీలు నిధుల కొరతతో సతమతమవుతుండడంతో డ్రెయిన్లను పట్టించుకునే నాథుడే లేడు. రాజోలు దీవిలో మలికిపురం, తాటిపాక, రాజోలు, సఖినేటిపల్లి వంటి గ్రామాల్లో కొన్ని చోట్ల ఆర్‌డబ్ల్యూఎస్ నిధులతో గతంలో ఒకటి, రెండు కాలనీల్లో డ్రెయిన్లు నిర్మించినప్పటికీ అవి కూడా సక్రమంగా పని చేయని దుస్థితి నెలకొంది.

భారీ వర్షాలకు వీధులు జలమయం

వర్షాకాలంలో ఎలాగూ డ్రెయిన్లను అభివృద్ధి చేయలేరు. ప్రస్తుతం వేసవిలో వీటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి నిధులను సమకూర్చేందుకు కార్యాచరణ రూపొందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పలు సమీక్ష సమావేశాల్లో రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ఈ మేరకు సూచనలు చేసినా ఆ శాఖల నుంచి స్పందన లేదు. డ్రెయిన్ల శుభ్రత, ఆధునీకరణపై అధికారులు చిత్తశుద్ధితో పని చేయడం లేదు. భారీ వర్షాలు వస్తే మలికిపురం జలమయమవుతోంది. రాజోలు, తాటిపాకలో మురుగునీరు ఇళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. ఇక మిగిలిన గ్రామాల్లో మురుగునీరు, వ్యవసాయ పంట బోదెలు కూడా ఆక్రమణల వల్ల వర్షం నీరు దిగదు. ఇటీవల ఇళ్ల నిర్మాణ సమయంలో పంచాయతీ పాలకులు అక్రమంగా అనుమతులు ఇవ్వడం వల్ల రోడ్ల పక్కన సరిహద్దుల్లో స్థలం మినహాయింపు లేకుండా భవనాలను నిర్మించడం వల్ల ఈ దుస్థితి నెలకొందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పంచాయతీల వద్ద నిధులు నిల్

మురుగునీటి పారుదల వ్యవస్థ నానాటికీ చిన్నాభిన్నమవుతోంది. వర్షాకాలంలో మురుగునీరు చెత్తా చెదారంతో కలసి కాలనీల్లోకి రావడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వారం నుంచి, నెలల తరబడి మురుగునీరు కాలనీల్లో తిష్ట వేస్తోంది. ఉన్న డ్రెయిన్లు కూడా పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి పొంగుతోంది. దీంతో దుర్గంధంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పంచాయతీల వద్ద కనీసం బ్లీచింగ్ చల్లేందుకు కూడా డబ్బులు లేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఉపాధి హామీలో పథకంలో ఈ డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టే అవకాశం ఉన్నా పంచాయతీలు, ఉపాధి హామీ విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రాజోలు దీవిలో సుమారు 57 గ్రామాల్లో డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి.

డ్రెయిన్లు బాగు చేయాలి



వర్షాకాలం వచ్చే సమయానికి గ్రామీణ ప్రాంతంలోని డ్రెయిన్లను బాగు చేయాలి. లేకుంటే ప్రజలు చాలా ఇబ్బంది పడతారు. గ్రామాల్లో అనేక కాలనీలు లోతట్టుగా ఉన్నాయి. మెరక పనులు చేపట్టలేదు. ప్రధాన కూడళ్లు సైతం ముంపుబారిన పడుతున్నాయి. కొన్ని కాలనీల్లో డ్రెయిన్లు లేకపోవడంతో వర్షం కురిస్తే అపరిశుభ్రత నెలకొంటోంది.

– బల్ల ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ